చింతపల్లి డిఎస్‌పిగా షహబాజ్ అహమ్మద్

ప్రజాశక్తి - చింతపల్లి :- చింతపల్లి సబ్ డివిజన్ డిఎస్పీగా షహబాజ్ అహమ్మద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన ఆయన చింతపల్లిలో డీఎస్పీగా నియమితులయ్యారు. దీంతో, శనివారం ఆయన చింతపల్లి డి.ఎస్.పిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు. డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బందితో సమన్వయం చేసుకొని పని చేస్తానన్నారు. మన్యంలో గంజాయి సాగు, అక్రమ రవాణా, జూద క్రీడల నియంత్రణపై కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా స్వయంగా తనను కలిసి సమస్యను చెప్పుకోవచ్చని తెలిపారు. సీఐలు, ఎస్సైలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

అసంపూర్తిగా అంగన్వాడీ భవనం

-నివాస గృహం వరండాలోనే విద్యా బోధన
-అవస్థలు పడుతున్న చిన్నారులు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ గుమ్మగూడ గ్రామంలో అంగన్వాడి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణం పూర్తిస్థాయిలో చేపట్టకుండా అసంపూర్తిగా వదిలేయడంతో చిన్నారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో అంగన్వాడి కేంద్రానికి సొంత భవనం లేకపోవడంతో అంగన్వాడి కార్యకర్త నివాస గృహం వరండాలో నిర్వహణ కొనసాగిస్తున్నారు. వర్షాలు కురిసినప్పుడు వరండాల్లో కూర్చోవడానికి చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కేంద్రంలో మూడేళ్ల లోపు చిన్నారులు 11 మంది ఉండగా, ప్రీస్కూల్ చిన్నారులు మరో 12 మంది ఉన్నారు.

2019లో అంగన్వాడి నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి శ్లాబ్ దశ వరకు నిర్మించి ప్లాస్టింగ్ చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. సుమారు నాలుగేళ్లు గడుస్తున్నా నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. భవన నిర్మాణం పూర్తి చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగన్వాడి భవనాన్ని పూర్తిచేసి చిన్నారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అసంపూర్తిగా నిలిచిన నిర్మాణ పనులు

వరండాలో చదువుతున్న చిన్నారులు

మలేరియాతో మంచం పట్టిన కాశీపట్నం

అనారోగ్యంతో బాధపడుతున్న మహిళ

ప్రజాశక్తి -అనంతగిరి:కాశీపట్నం గ్రామానికి మలేరియా ప్రబలింది. ఇంటింటా మంచం పట్టిన రోగులు ఉన్నారు. అనంతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కాశీపట్నం సబ్ సెంటర్ కాశీపట్నం గ్రామంలో గత రెండు వారాల నుండి సరైన వైద్య సేవలు అందక మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ప్రతి ఇంటింటా రోగులు ఉన్నారు. వ్యాధులతో బాధపడుతున్న వారిలో రాళ్లపూడి .వెంకటరమణ, సోము దుర్గ, తాడేపుడి. రాజేశ్వరి, జర్ర లక్ష్మి, ఎల్ చంద్రయ్య, ఆర్ .యామని, పి. సింహాచలం, . ప్రశాంతి, ఆర్.సంతోషం, బి.లక్ష్మి, చిన్నలమ్మలతో పాటు పలువురు ఉన్నారు. 60 కుటుంబాలు ఉండగా ప్రతి ఇంటింటికి ఇద్దరు ముగ్గురు చొప్పున విష జ్వరాలతో తోపాటు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. వైద్య సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న కార్యాకర్తలు, మహిళలు

విఆర్‌ఒ, డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలి

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని తీగలవలస పంచాయతీలో వీఆర్వో, డిజిటల్ అసిస్టెంట్‌లను నియమించాలని ఆదివాసీ సామాజిక కార్యకర్తలు కిల్లో కామరాజు, బి.మోహన్ కోరారు. శనివారం సచివాలయానికి పలువురు పిల్లలకు బర్త్, క్యాస్ట్, ఇన్కమ్ సర్టిఫికెట్‌ల కోసం వచ్చారన్నారు. విఆర్‌ఓ, డిజిటల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయక పోవడంతో సేవలు వినియోగించినందుకు వచ్చిన జనాలు ఇబ్బందులు పడ్డారని వారు అన్నారు. బదిలీ అయిన వీరి స్థానంలో నియమించే విషయంలో జాప్యం ఎందుకని వారు ప్రశ్నించారు. ఐటిడిఏ అధికారులు స్పందించి పంచాయతీలో విఆర్వో, డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని వారు కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

9 నుండి అధిక ధరలపై ఆందోళనలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-కొయ్యూరు

భారీగా పెరిగిన అన్ని రకాల ధరలను నియంత్రించాలని కోరుతూ ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స తెలిపారు. మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో అప్పలనర్స మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలను నియంత్రిస్తామని ఎన్నికల సందర్భంగా వాడవాడలా ప్రచారం నిర్వహించిన చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు ఆకాశాన్ని అంటుతున్నా కనీసం నోరు మెదపడం లేదని మండిపడ్డారు. సామాన్యులకు భారంగా మారిన నిత్యవసరాల సరుకుల ధరలు తగ్గించింతవరకు ప్రజల పక్షాన సిపిఎం పోరాటం చేస్తుందని చెప్పారు. ఈనెల 9 నుంచి 15వ తేదీ

విద్యా బోధన చేస్తున్న విద్యా వాలంటీరు

సొంత డబ్బులతో విద్యా వాలంటీరు ఏర్పాటు

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం ఎ.దారకొండ పంచాయతీ తడకపల్లి జిపిఎస్ పాఠశాలకు ప్రభుత్వం ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ సొంత డబ్బులతో విద్యా వాలంటీర్లని ఏర్పాటు చేసుకున్నారు. ఈ పాఠశాల ఉపాధ్యాయుడు ఆగస్టులో బదిలీపై వెళ్లిపోగా ఆయన స్థానంలో మరో ఉపాధ్యాయుడిని ప్రభుత్వం నియమించలేదు. తమ పాఠశాలలో విద్యా బోధనకు ఉపాధ్యాయులు లేరని, టీచర్‌ను నియమించాలని పత్రికల ద్వారా స్థానికులు మొరపెట్టుకున్నా కలెక్టర్‌గాని, ఐటిడిఎ పిఒగాని స్పందించలేదు. తమ పిల్లలు విద్యకు దూరం కాకూడదని తడకపల్లి గ్రామస్తులు భావించి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి సొంత డబ్బులతో విద్యా వాలంటీర్లు నియమించుకోవడానికి నిర్ణయం తీసుకున్నారు. తల్లిదండ్రులు ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేసి ఇస్తామని చెప్పి విద్యా వాలంటీరును ఒప్పించి ఏర్పాటు చేసుకున్నారు. ఈ మేరకు సిపిఎం గాలకొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు మాట్లాడుతూ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించకపోతే విద్యా బోధన ఎలా సాగుతుందని ప్రశ్నించారు. టీచర్‌ను నియమించకుండా అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ, విద్యాశాఖ అధికారులు స్పందించి తక్షణమే తడకపల్లి జిపిఎస్ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలని బుజ్జిబాబు డిమాండ్ చేశారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

-డ్రాపౌట్స్ లేకుండా చూడాలి - జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ

ప్రజాశక్తి హుకుంపేట:మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మండలంలోని యాజమాన్యాల పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం పలు సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యానైపున్యాలు, పెంపొందించాలన్నారు. విద్యా వ్యవస్థ పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, స్థాయికి అనుగుణంగా విదాత్య బోధన చేయాలని ఆయన సూచించారు. వెనుకబడిన విద్యార్థులను అభివృద్ధి చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని అయన అన్నారు. డ్రాప్ అవుట్ లేకుండా ఉపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు సోమేలి చెల్లయ్య, కోడా. ఈశ్వరరావు, ఆర్పీలు ప్రభాకర్, కంఠం నాయుడు, రామమూర్తి, చిన్నారావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి

మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి హామీ పనులపై సమీక్ష

ప్రజాశక్తి-అనంతగిరి:మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై శనివారం ఎంపీడీఒ ఏవివి కుమార్ ఆధ్వర్యాన ఇన్చార్జి ఏపిడి పవన్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిఒలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో పనులు కల్పించి కనీస కూలి రేకులు అందించాలన్నారు. వంద రోజుల పని దినాల పనులు మొదలుపెట్టి గడువు నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ పనులకు సంబంధించి వారం రోజుల్లోపు పురోగతి సాధించకుండా నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోక తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఒ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎంపిపి

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి- చింతపల్లి :సిమెంటు రహదారులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి కోరారు. మండల పరిషత్ నిధులు ఎనిమిది లక్షలతో నిర్మించ తలపెట్టిన కిటుముల పంచాయతీ రాచపనుకు గ్రామంలో 200 మీటర్ల సిమెంటు రహదారి నిర్మాణ పనులను ఆ పంచాయతీ సర్పంచ్ గెమ్మెల రమణమ్మ, వైస్ ఎంపీపీలు గోపి నాయక శారద, సాగిన వెంగళరావు ఎంపీటీసీలు వనము పద్మ, పొట్టిక లోవరాజు, తాంబేలి మోహనరావు, పంచాయతీరాజ్ ఏ ఈ బాలకిషోర్‌లతో కలిసి శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనూష దేవి మాట్లాడుతూ,గత ప్రభుత్వంలోనూ ఎన్నో గ్రామాలలో సిమెంటు రహదారుల నిర్మాణానికి కృషి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్ సుర్ల లోవరాజు, వైకాపా నాయకుడు వనుము పోతురాజు, రాచ పనుకు గ్రామస్తులు పాల్గొన్నారు.

టిటిడిలో చోటు కల్పించడంపై హర్షం

ప్రజాశక్తి-చింతపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ కమిటీలో విశ్వబ్రాహ్మణునికి చోటు కల్పించడం ఆనందదాయకమని స్థానిక విశ్వబ్రాహ్మణుడు, తెదేపా అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగభూషణం అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు కమిటీలో తమ సామాజిక వర్గానికి సంబంధించి బూరగాపు అనంద సాయికి టీటీడీ సభ్యునిగా నియమించి సముచిత స్థానం కల్పించడం హర్షదాయకమన్నారు. బూరగాపు అనంద సాయి కి అభినందనలు తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి-మోతుగూడెం, సీలేరు

వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయితీ దిగు సీలేరు డొంకరాయిలో సిఐటియు ఆధ్వర్యాన శనివారం కాంట్రాక్టు, అసంఘటిత రంగ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డొంకరాయి సెంటర్లో సిఐటియు జెండాను వెంకట్ ఆవిష్కరించారు. సిఐటియు జిందాబాద్.., కార్మికులు ఐక్యత వర్ధిల్లాలి.. హక్కుల సాధనకై పోరాడుదాం అంటూ పెద్ద ఎత్తు నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో వెంకట్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, అసంఘటిత రంగ కార్మికులకు కూలి రేట్లు పెంచేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఏళ్ల తరబడి వివిధ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. కూలీలు రేట్లు పెంచాలని కూలీలు డొంకరాయిలో మూడు నెలలు క్రితం ఆందోళన చేస్తే సిఐటియు అండగా నిలబడిందని, కూలీలు విజయం సాధించారని గుర్తు చేశారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథక కార్మికులు, వెలుగు విఓఎలు, ఉపాధి హామీ మేట్లు, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై సిఐటియు అనేక పోరాటాలు చేసినట్లు చెప్పారు. 1970లో ఏర్పడిన సిఐటియు కార్మికులు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్న అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూలిరేట్లు పెంపు కోసం, గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పన కోసం, సమగ్ర సంక్షేమ చట్టం కోసం, బొడ్డగండి పంచాయతీ కార్మికులకు కనీస వేతనాల కోసం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, సిఐటియు సీలేరు గౌరవ అధ్యక్షులు ఎస్కె. సుభాన్, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింత రాంబాబు, బొడ్డగండి సిఐటియు కార్యదర్శి కిలో ముక్త, ఉపాధ్యక్షులు మంగల్ దాన్, సీలేరు సిఐటియు బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణ్ ఉపాధ్యక్షులు జి.లక్ష్మణ్, రమణబాబు, అబ్బులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న వెంకట్, కార్మికులు

4న చలో ఐటిడిఎకు తరలిరావాలి

డైట్ కళాశాలలో ప్రచారం

ప్రజాశక్తి-రంపచోడవరం

జీవో నెంబర్ 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలని, మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ ప్రాంత పోస్టులపై స్పష్టత ఇవ్వాలని, ఆదివాసీ చట్టాలను, జీవోలను కాపాడాలని కోరుతూ ఆదివాసీ నిరుద్యోగ జేఏసీ ఈనెల 4న తలపెట్టిన చలో ఐటిడిఎ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రంపచోడవరం డైట్ కళాశాలలో శనివారం ప్రచారం చేశారు. ఇందులో లోతా రామారావు మాట్లాడుతూ జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసిన తర్వాతనే ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పిన చంద్రబాబు, నేడు ఆ హామీని మర్చిపోయి మెగా డీఎస్సీ విడుదలకు సిద్ధమయ్యారని తెలిపారు. జీవో 3ను పునరుద్ధరించకుండా ఆదివాసీ నిరుద్యోగుల ఏ విధంగా న్యాయం జరుగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గిరిజనుల మీద ప్రేమ ఉంటే అరకు బహిరంగ సభలో చంద్రబాబు చెప్పిన విధంగా జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసిన తర్వాతనే మెగా డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నిరుద్యోగులు అశోక్ మాట్లాడుతూ జనరల్ రిజర్వేషన్ల ప్రకారం మెగా డీఎస్సీలో ఆదివాసీలకు కేవలం శాతం రిజర్వేషన్ మాత్రమే వర్తిస్తుందని, దీని వల్ల గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ అన్యాయాన్ని నిరుద్యోగులు గ్రహించి సోమవారం ఐటీడీఏ ముందు జరిగే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లె రెడ్డి, ఉద్యోగ జేఏసీ సభ్యులు సోడే చందు, సున్నం అశోక్, సున్నం కావ్య, విద్యార్థి సంఘం నాయకులు వినోద్, గణేష్, జంపన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : ఈ నెల 4న చలో ఐటిడిఎను జయప్రదం చేయాలని ఆదివాసీ జెఎసి నాయకులు తెల్లం శేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కారం రామన్న దొర, యలగాడ నాగేశ్వరరావు, సింబోతుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంఘాల నేతలు

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లోతట్టు ప్రాంతం లోదొడ్డి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు.ట 70 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు మలేరియా నిర్ధారణ, హిమోగ్లోబిన్ తరితర పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో బాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని హెల్త్ ఆఫీసర్ భవాని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది చిన్నయమ్మ, లక్ష్మీ, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ అందజేత

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండల కేంద్రం మారేడుమిల్లి గ్రామ యువతకు శనివారం టిడిపి మండల ఉపాధ్యక్షులు దూడ సువర్ణ కర్ణ కుమార్, యూత్ ప్రెసిడెంట్ నల్లమిల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యాన వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఉద్దేశంతో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి వీరబాబు, యువకులు పాల్గొన్నారు.

యువతకు వాలీబాల్ కిట్ అందిస్తున్న టిడిపి నాయకులు

లోహిత్‌ను సన్మానిస్తున్న ట్రస్టు చైర్మన్ వికాస్

అథ్లెటిక్స్ క్రీడాకారునికి ఘన సన్మానం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ :జాతీయ అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు శెట్టి లోహిత్ నివాస గృహంలో మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్ చేతుల మీదుగా శనివారం సందర్శించి శాలువాతో సత్కరించారు. ఇటీవల రాజమహేంద్రవరం, గుంటూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రోహిత్‌ను అన్ని విధాలుగా ట్రస్టు ద్వారా ఆదుకుంటామని ట్రస్టు చైర్మన్ అన్నారు. ఈ నెలలో ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో నిర్వహించే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన చెప్పారు. జాతీయస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహించాలని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బాబీవర్ధన్

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటు

ప్రజాశక్తి-లీగల్ : ఢిల్లీ ప్రొఫెసర్ సాయిబాబా మరణం మానవ హక్కుల పరిరక్షణలో తీరని లోటు అని, దానిని ఎవరూ పూడ్చలేనిదని ఆంధ్ర యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ హెడ్ ప్రొఫెసర్ బాబి వర్ధన్ అన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) విశాఖపట్నం కమిటీ ఆధ్వర్యాన కీర్తిశేషులు ప్రొఫెసర్ ఢిల్లీ సాయిబాబా సంస్మరణ సభను అల్లూరి విజ్ఞానకేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బాబీవర్ధన్ హాజరై ప్రసంగించారు. నేటి ప్రసార మాధ్యమాలు అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల చేతుల్లో నడుస్తున్నాయన్నరు. దీని వల్ల సాయిబాబా లాంటి ప్రజా ఉద్యమాలకు నిలయమైన వ్యక్తులకు జరిగే నష్టాలను ప్రజలకు, తెలియజేయటంలో విఫలమవుతున్నాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా అరెస్టులో ప్రభుత్వ కక్ష సాధింపు, న్యాయవ్యవస్థ విఫలమయ్యే పరిస్థితులు స్పష్టమయ్యాయని తెలిపారు. మరో విశిష్ట అతిథి, న్యాయవాద సంఘం పూర్వ అధ్యక్షులు వైద్యుల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, సాయిబాబాను జైల్లో ప్రత్యేకమైన చీకటి గదిలో ఉంచి ఆయనకు అందవలసిన ఖైదీ హక్కులను కూడా ఇవ్వకుండా హరింప చేయడంలో రాజ్య హింస ప్రస్ఫుటమయిందని చెప్పారు సీనియర్ న్యాయవాది వివి బాలకృష్ణ మాట్లాడుతూ, ప్రజా పీడిత, సామాన్య ప్రజల హక్కులను కాపాడడంలో సాయిబాబా పాత్ర వేగుచుక్క లాంటిదని కొనియాడారు. సభాధ్యక్షులు, ఐలు విశాఖ యూనిట్ అధ్యక్షులు అల్లు సురేష్ మాట్లాడుతూ, 90 శాతం అంగవైకల్యం కలిగిన సాయిబాబాపై రాజ్యం దాడి వల్ల జైల్లో పూర్తిగా వైద్యమందక ఆయన అంతర్గత అవయవాలు పాడైపోయాయని, దాన్ని పర్యవసానంగా మరణం సంభవించిందని వాపోయారు. ఇది ఒక రకంగా హక్కుల పరిరక్షణ కార్యకర్తకు ప్రభుత్వం ఇచ్చిన బహుమతులాంటిదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐలు విశాఖ యూనిట్ జనరల్ సెక్రటరీ ఎన్.వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షులు చాట ఆనందరెడ్డి, కెవై.మణి, కోశాధికారి అప్పలరెడ్డి, పెద్ద ఎత్తున సీనియర్, జూనియర్ న్యాయవాదులు, హక్కులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మన్యంలో వలిసె అందాలు కనువిందు

సెల్ఫీలతో పర్యాటకుల సందడి

వలిసె పూల తోట

ప్రజాశక్తి- అరకులోయ:పర్యాటక కేంద్రమైన అల్లూరి జిల్లా మన్య ప్రాంతంలో వలిసే అందాలు కనువిందు చేస్తున్నాయి. అక్టోబర్ మొదలుకొని డిసెంబర్ వరకు పర్యాటకుల మదిని దోచుకుంటుంది. ఏజెన్సీ ముఖద్వారం చిలకలగడ్డ ప్రాంతం నుంచి దారి పొడవునా వలిసె పూల అందాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది. అక్టోబర్ నెలలో పసుపు పచ్చటి వలిసే పూలతో ఒకపక్క పర్యాటకులను మైమరిపిస్తుంటే, మరోపక్క వెండి మబ్బును తలపించే విధంగా ఉండే పాల సముద్రంలా ఉండే కొండలు పర్యాటకుల మదిని దోచుకుంటున్నాయి. దీంతో అరకును సందర్శించే పర్యాటకులు తీవ్ర అనుభూతికి లోనవుతున్నారు. సహజ ప్రకృతి అందాలకు నిలయమైన అరకులోయ ప్రాంత పర్యాటక కేంద్రాల్లో ఈ సీజన్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెల కొనడంతో దేశ విదేశాల నుంచి పర్యాటకులు వందల వేల సంఖ్యలో ఇక్కడికి తరలి వస్తున్నారు. చూడముచ్చటగా ఉన్న గిరిజన సంస్కృతిక మ్యూజియం, పద్మావతి ఉద్యానవన కేంద్రం, బొర్రా గుహాలతో పాటు చాపరాయి జలపాతంలో కలగని ఆనందం పచ్చగా పరుచుకొని ఉండే వలసే పూల వనాలు చూపరులను అమీతంగా ఆకట్టుకొని పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేస్తుంది. అల్లూరి ఏజెన్సీలో ఏ పర్యాటకులు సందర్శించిన వలస పూల వనాల్లో కుటుంబ సమేతంగా సెల్ఫీలు తీసుకోవడానికి ఎగబడుతుంటారు.

ఇదిలా ఉండగా, పర్యాటక కేంద్రమైన ఈ ప్రాంతాల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టక పోవడంతో ఇక్కడికి సందర్శించిన పర్యాటకులు కొంత నిరాశకు గురవుతున్నారు. పర్యాటక శాఖ ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడం ఒక వంతు అయితే, వలిసే పంటను ప్రభుత్వం, ఐటీడీఏ రైతులకు ప్రోత్సహించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గిరిజన వలసే రైతులు తెలిపారు. దీనికి తోడు మన్య ప్రాంతంలో హైవే రోడ్డు పనులు జరుగుతుండటంతో రోడ్డు పక్కన ఉన్న పంట భూములు హైవే రోడ్డులో పోవడంతో వలసే పంట సాగు తగ్గిపోయింది. అరకులోయ ప్రాంతంలో పెరుగుతున్న పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని వలసే పంట సాగుపై గిరిజన రైతులకు ప్రోత్సహించాలని, ఉచితంగా విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తే ఈ ప్రాంతం వలసే రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా, పర్యాటకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వలిసె పూల అందాలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు

నూతన సాంకేతికతతో అపార ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా యువత భారీ వేతనాలతో ఉపాధి అవకాశాలను సాధించవచ్చునని ఎయు విసి ఆచార్య జి. శశిభూషణరావు తెలిపారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాలలోని వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో ఐఈఈఈ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సదస్సును శనివారం ఆయన ప్రారంభించారు. ఐఈఈఈ వైజాగ్ బే సెక్షన్ ఆధ్వర్యాన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ స్మార్ట్ అండ్ గ్రీన్ టెక్నాలజీస్‌ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ, రానున్న కాలంలో 85 శాతానికి పైగా అప్లికేషన్స్‌లో ఎఐ, ఎంఎల్ తదితర సాంకేతికతలను వినియోగించే అవకాశం ఉందన్నారు. 160 దేశాలలో 4.6 లక్షల మంది సభ్యులను కలిగి అతి పెద్ద సంస్థగా ఐఈఈఈ నిలుస్తోందని చెప్పారు. నేటి తరం యువత ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ యువతను అత్యధికంగా కలిగిన దేశంగా నేడు భారత్ నిలుస్తోందని చెప్పారు. శాస్త్రీయ ప్రగతిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు, ఆవిష్కరణలకు నిలయాలుగా నిలుస్తాయని అన్నారు. అకడమిక్ ఇనిస్టిట్యూషన్లలో ఆవిష్కరణను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సు జనరల్ చైర్ డాక్టర్ ఎస్.లక్ష్మీనారాయణ, టిపిసి చైర్ ఆచార్య దీపికా రాణి తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను బీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆవిష్కరించారు.

యువత అవినీతికి దూరంగా నడుచుకోవాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : యువత అవినీతికి దూరంగా నడుచుకోవాలని, తద్వారా దేశాభివృద్ధి సాధ్యపడుతుందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని ఏయు విద్య విభాగంలో విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిఇడి, ఎంఇడి విద్యార్థులనుద్దేశించి ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ, అవినీతికి దూరంగా ఉండటం, అవినీతిని ప్రోత్సహించకపోవడం దేశభక్తిగా నిలుస్తుందని చెప్పారు. నిజాయితీతో మెలగడం వలన దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు.

విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు మాట్లాడుతూ భవిష్యత్తు తరానికి మార్గదర్శనం చేసే ఉపాధ్యాయ వృత్తిలో అడుగిడే వారంతా నిజాయతీ, సచ్ఛీలతతో నడుచుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుడు చెప్పే ప్రతి మాటను విద్యార్థులు స్వీకరించి తమ మెదడులో నిక్షిప్తం చేసుకుంటారని తెలిపారు. ఏయూ జర్నలిజం విభాగం ఆచార్యులు, మీడియా రిలేషన్స్ డైరెక్టర్ ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ, అవినీతిపై పోరాటాన్ని ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. మనిషికి వ్యాధి సంక్రమిస్తే ఎంతటి ప్రమాదమో, దేశంలో అవినీతి కూడా అంతే ప్రమాదమని చెప్పారు. కార్యక్రమంలో విద్యావిభాగం అధ్యాపకులు విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి
- ఏడుగురిపై కేసు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలోని శుక్రవారం సాయంత్రం సమయంలో హుకుంపేట, చుట్టుపక్క గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులు జూదం ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసలు ఏడుగురిని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్సై ఎల్.సురేష్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. జూదం ఆటలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జూదరుల వద్ద నుంచి రూ. 12,860 నగదును మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.

15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-హుకుంపేట:- మండలంలోని గూడ పంచాయతీ గొచ్చర్ల గ్రామం, మెరక చింత పంచాయతీ రంగసింగపాడు గ్రామంకి చెందిన వ్యక్తులు నాటుసారా తయారుచేసి అమ్మకాలు చేపడుతుండగా వారి పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ సురేష్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఈ గ్రామాలను సందర్శించి తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో ఇద్దరి వద్ద నుంచి 15లీటర్ల నాటుసారా పట్టుకొని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించడం జరిగిందని పేర్కొన్నారు. నాటు సారా తయారీ, అమ్మకం చట్టరీత్యా నేరం అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటి ఉద్యోగి మృతి

ప్రజాశక్తి -మధురవాడ : పిఎంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐటి ఉద్యోగి మృతి చెందినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొత్తూరుకు చెందిన ఎం.క్రాంతికుమార్ (21) మధురవాడ నగరంపాలెం రోడ్డులో తన తల్లితో కలిసి నివాసం ఉంటున్నాడు. మధురవాడ ఐటి హిల్స్‌లోని టెక్ మహేంద్రలో విధులు నిర్వహిస్తున్నాడు. క్రాంతికుమార్ శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తు మార్గ మధ్యలో ఐటి హిల్స్ బీచ్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. కిందపడిన క్రాంతికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు గుర్తించి అతనిని చికిత్స నిమిత్తం స్థానిక గీతం ఆసుపత్రికి తరలించారు. పోలీసులకు సమాచారం అందించారు. క్రాంతి కుమార్ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పిఎం.పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. మృతుని తల్లి ఎం.రామప్రభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

జగ్జీవన్‌రామ్ కాలనీలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి బాబూ జగ్జీవన్‌రామ్‌కాలనీలోని ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఇంటి యజమాని దొర భార్య హేమ వంట చేస్తుండగా ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఆమె ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. బయటకు వచ్చిన క్షణాలలోనే విద్యుత్ తీగలు వల్ల ఇల్లు మొత్తం దగ్ధమైంది. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. సుమారు రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఇంటి యజమాని దొర చెబుతునానరు. స్థానిక తహసీల్దార్‌కు సమాచారం అందజేశారు.

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి -అచ్యుతాపురం : అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మేరుగు మహాలక్ష్మి మృతి చెందగా, ఆయన స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని పూడిమడక శివారు కడపాలెం గ్రామానికి చెందిన మేరుగు మహాలక్ష్మి, స్నేహితునితో కలిసి శనివారం సాయంత్రం అచ్యుతాపురం నుంచి పూడిమడక వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. అచ్యుతాపురం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోగేదెలు అడ్డంగా రావడంతో వాటిని తప్పించబోయి, అటుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. దీంతో మహాలక్ష్మి తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం జరిగి సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆయన స్నేహితుడు తీవ్రంగా గాయపడడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉంది. మహాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి లక్ష్మి, తదితరులు

బోర్ల తవ్వకం పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామపంచాయతీ పరిధి రామవరంపాడు, కొప్పెలి గ్రామాల్లో మండల పరిషత్ నిధులతో మంచినీటి సౌకర్యార్థం బోర్లు తవ్వకం పనులను శనివారం ఎంపీపీ కారం లక్ష్మి, స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మి మాట్లాడుతూ కొంతకాలం నుండి మంచి నీళ్ల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను గుర్తించి మండల పరిషత్ నిధులతో బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కారం సుందరయ్య, వడ్లది రమేష్, కారం సత్యం, పులి దూలయ్య, బుజ్జి శ్రీనివాస్ రెడ్డి, గోపాలరావు, లక్ష్మయ్య, వర్మ దాసయ్య, గ్రామ సెక్రెటరీ తాతారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి, సచివాలయం సిబ్బంది, రామవరంపాడు, కొప్పెలీ రెండు గ్రామల పెద్దలు పాల్గొన్నారు.

ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం, చింతూరు ఐటిడిఎల పరిధిలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకొని డెమో ఇచ్చిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 5న మండళవారం జరుగు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పథకం నిర్వాహణాధికారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5న ఉదయం 8 గంటల రంపచోడవరం ఐటిడిఎ మీటింగ్ హాల్లో ఈ ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం ఆర్ కొత్తూరు గ్రామంలో రూ.4లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి గిరిజన సహకార సంస్థ మాజీ చైర్మన్ ఎంవివి.ప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కూడా నూకరాజు, ఉప సర్పంచ్ అప్పలనాయుడు, మాజీ జడ్పిటిసి గాడి శ్రీరామ్మూర్తి, టిడిపి నాయకులు ఆర్.గోవిందు, ఉండా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం ఎం.మాకవరం పంచాయతీ పిట్టాచలాం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం ఆ పార్టీ మండల అధ్యక్షులు గొలిసింగి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం జరిగింది. కార్యక్రమంలో తెలుగునాడు విద్యార్థి విభాగం అధ్యక్షులు పొటుకూరి సన్యాసిరావు, మాజీ ఎంపిటిసి కిలే బాలరాజు, బూత్ కన్వీనర్ ప్రసాద్, జనసేన నాయకులు సంజీవరావు, సీనియర్ నాయకులు బాలయ్య, మహిళలు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని లబ్బర్తి గ్రామంలో ఓ దుకాణంలో అక్రమంగా విక్రయిస్తున్న 15 మద్యం బాటిళ్ల శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు రాజవొమ్మంగి ఎస్సై నరసింహమూర్తి తెలిపారు. ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహించినా, మద్యం విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా మద్యం అక్రమ అమ్మకాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

6న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండల పరిషత్తు సమావేశం ఈనెల 6న మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

అగర్తల - సికింద్రాబాద్ మధ్య వన్ వే ప్రత్యేక రైలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పండగ సీజన్‌లో ప్రయాణికుల అదనపు రద్దీని నియంత్రించేందుకు అగర్తల నుండి సికింద్రాబాద్‌కు వన్ వే ప్రత్యేక రైలును నడపాలని రైల్వే నిర్ణయించింది. ఈ క్రమంలో 05629 అగర్తల - సికింద్రాబాద్ వన్ వే ప్రత్యేక రైలు నవంబర్ 3 ఆదివారం ఉదయం 6.20 గంటలకు అగర్తలలో బయలుదేరి సోమవారం తెల్లవారుజామున 03.35 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 03.40 గంటలకు బయలుదేరి అదేరోజు సాయంత్రం 16.15 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో బాలాసోర్, భద్రక్, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్, బ్రహ్మపూర్, శ్రీకాకుళం రోడ్, విజయనగరం, దువ్వాడ మీదుగా ప్రయాణిస్తుంది.

ఖుర్దా రోడ్ డివిజన్‌లో రైళ్ల నియంత్రణ

ఖుర్దా రోడ్ డివిజన్‌లోని సోంపేట - జాదుపూడి - ఇచ్ఛాపురం సెక్షన్‌లో భద్రతా పనుల దృష్ట్యా నవంబర్ 4 నుండి డిసెంబర్ 4 వరకు సోమ, గురు, శనివారాల్లో పలు రైళ్ల సేవలు నియంత్రించబడతాయని అధికారులు తెలిపారు. 12897 పుదుచ్చేరి - భువనేశ్వర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 6, 13, 20 27 తేదీలలో నిర్ణీత సమయం 18:50 గంటలకు బదులు 2 గంటలు ఆలస్యంగా రాత్రి 20:50 గంటలకు పుదుచ్చేరి నుండి బయలుదేరుతుంది. 18464 కెఎస్ఆర్ బెంగళూరు - భువనేశ్వర్ ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నవంబర్ 3, 6, 8, 10, 13, 15, 17, 20, 22, 24, 29, డిసెంబర్ 1, 3 తేదీలలో షెడ్యూల్ సమయం 13:40 గంటలకు బదులు 2 గంటలా 15 నిమిషాలు ఆలస్యంగా 15:55 గంటలకు కెఎస్ఆర్ బెంగళూరులో బయలుదేరుతుంది.

20895 రామేశ్వరం - భువనేశ్వర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 3, 10, 17, డిసెంబర్ 1 తేదీలలో షెడ్యూల్ సమయం 8:40 గంటలకు బదులు రెండు గంటల ఆలస్యంగా 10:40 గంటలకు రామేశ్వరం నుండి బయలుదేరుతుంది. 07027 సికింద్రాబాద్ - బ్రహ్మపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ నవంబర్ 8, 15, 22, 29 తేదీల్లో షెడ్యూల్ సమయం 22:15 గంటలకు బదులు 2 గంటల ఆలస్యంగా అర్ధరాత్రి 00:15 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది.

రైల్వే స్టేషన్‌లో 14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ రైల్వే స్టేషన్‌లో 14 కిలోల గంజాయిని రైల్వే పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్నం జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్ మారూఫ్, ఆర్‌పిఎఫ్ ఎఎస్ఐ చిట్టిబాబు సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారాల్లో ముమ్మర తనిఖీలు చేస్తుండగా పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన గడదేస గణపతి ఉత్తరప్రదేశ్ లోని వారణాసికి గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డాడు. ఆయన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జుల నియామకం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిలను పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల నియమించారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు ఉండగా 62 నియోజకవర్గాల పార్టీ ఇన్‌ఛార్జులను నియమిస్తూ శనివారం ఆమె ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా 8 నియోజకవర్గాలకు పార్టీ ఇన్‌ఛార్జులను ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా సతక బుల్లిబాబు నియమితులుకాగా విశాఖ జిల్లా ఉత్తర ఇన్‌ఛార్జిగా అడ్డాల వెంకట వర్మ రాజు (హాసిని వర్మ), పశ్చిమ నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కొత్తల వెంకట సూర్యనారాయణ, గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా లక్కరాజు రామారావు నియమితులయ్యారు. అనకాపల్లి జిల్లాలోని నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా కచ్చల చినబాబు, అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా మలువురెడ్డి కోటేశ్వరరావు, యలమంచిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా తనకాల అనంతరామ నర్సింగరావు, చోడవరం నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా గూడూరు వెంకటరావు నియమితులయ్యారు.

ఆకాశవాణిలో పలు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగంలో క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్, క్యాజువల్ బ్రాడ్‌కాస్ట్ అసిస్టెంట్‌గా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీసాయివెంపటి ఒక ప్రకటనలో తెలిపారు. క్యాజువల్ న్యూస్ రీడర్ కమ్ ట్రాన్స్‌లేటర్ నియామకానికి అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీతోపాటు తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని, ఆంగ్లం నుంచి తెలుగులో తర్జుమా చేయగల నైపుణ్యం, మంచి స్వరం కలిగి ఉండాలని స్పష్టం చేశారు. అలాగే రేడియో, టివి జర్నలిజంలో అనుభవం ఉండాలని, తెలుగు టైపింగ్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. అలాగే క్యాజువల్ బ్రాడ్‌కాస్ట్ అసిస్టెంట్ నియామకానికి అభ్యర్థులు రేడియో ప్రొడక్షన్లో ఏదైనా డిగ్రీ లేదా డిప్లొమా అర్హత కలిగి ఉండాలని, తెలుగు, ఆంగ్లభాషలో ప్రావీణ్యం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. ఆడియో రికార్డింగ్, ఎడిటింగ్‌లో అనుభవం ఉండాలని సూచించారు. అభ్యర్థులు 21 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు కలిగి, విశాఖపట్నం ప్రాంతంలో నివసించే వారు అర్హులని అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలలో ఒకటి నుంచి ఆరు రోజులు అసైన్‌మెంట్‌లను కేటాయిస్తామన్నారు. ఈ నియామకాలు శాశ్వత కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు కావని, పిఎఫ్, ఆరోగ్య పథకం, క్వార్టర్స్, పెన్షన్ వంటి ప్రయోజనాలు ఉండబోవని స్పష్టం చేశారు. ఆసక్తి కలిగిన జనరల్ క్యాటగిరి అభ్యర్థులు రూ.354 రూపాయలు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులు రూ.266 రూపాయలు దరఖాస్తు రుసుమును అకౌంట్ నేమ్ : ప్రసారభారతి బిసిఐ ఎయిర్ విశాఖపట్నం, అకౌంట్ నెంబర్ 10428603125, ఐఎఫ్‌సిఐ కోడ్ : ఎస్‌బిఐ000772, ఎస్‌బిఐ ఎయు క్యాంపస్ బ్రాంచ్' బ్యాంక్ అకౌంట్‌కు చెల్లించాలన్నారు. చెల్లించిన రసీదును దరఖాస్తుతో జతచేసి ఈనెల 5వ తేదీలోపు ది హెడ్ ఆఫీస్, ఆకాశవాణి, సిరిపురం, విశాఖపట్నం-53003 చిరునామాకు పంపించాలని కోరారు. దరఖాస్తు కవరు పైభాగంలో అప్లికేషన్ ఫర్ ఆర్ఎన్‌యు అని తప్పనిసరిగా రాయాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0891- 2522020 లేదా 9440674057 నెంబర్లను సంప్రదించాలని శ్రీసాయి వెంపటి కోరారు.

నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

రహదారి గోతులు పూడ్చాలని నిరసన

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం సీలేరు నుంచి పాలగెడ్డ వరకు ప్రధాన రహదారిలో ఏర్పడిన గోతులను పూడ్చండి మహాప్రభో అంటూ శనివారం వలసగెడ్డ గ్రామ సమీపంలో ప్రధాన రహదారిపై ప్రజాప్రతినిధులు, వలసగెడ్డ గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీలేరు సర్పంచ్ పాంగి దుర్గ, బాలాజీ లాడ్జి ఓనర్ నక్క జ్ఞానేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు కారే శ్రీనివాసు మాట్లాడుతూ ఈ రహదారి మొత్తం పెద్ద పెద్ద గోతులుగా తయారై రాకపోకలు సాగించడానికి ఇబ్బంది మారిందని, వాహనచోదకులు ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. గోతుల్లో వర్షపు నీరు నిండి ఉండడంతో అది గొయ్యో, రహదారో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి ప్రాణాంతకంగా ఉన్నా ఆర్ అండ్ బి అధికారులు కనీసం గోతులు పూడ్చే చర్యలు కూడా చేపట్టుకుపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు బాగోగులు ప్రభుత్వానికి, అధికారులుకు పట్టవా అంటూ ప్రశ్నించారు. విశాఖ, పాడేరు, విజయవాడ, రాజమండ్రి, డిపోలకు చెందిన బస్ సర్వీసులు ప్రతిరోజు రాత్రి, పగలు మార్గంలో తిరుగుతుంటాయని, ఎప్పుడు ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా సీలేరు నుంచి పాలగెడ్డ వరకు రహదారిలో గోతులను పూడ్చాలని, శాశ్వత రహదారి నిర్మాణానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వానపల్లి అప్పారావు, గిరిజనులు పాల్గొన్నారు.

అధికారుల నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థి

హెచ్ఎస్ఎల్‌లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. వీటిని 'సాంస్కృతిక సమగ్రత కోసం.. దేశ శ్రేయస్సు కోసం..' థీమ్‌తో నిర్వహించారు. అక్టోబర్ 28న ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించడంతో ఈ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా సభలు, వ్యాసరచన, నినాదాల పోటీలు చేపట్టారు. విక్రేతలు, కాంట్రాక్టర్ల కోసం ఇంట్రాక్షన్ సెషన్లను నిర్వహించారు. పిల్లలలో సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమాండర్ హేమంత ఖత్రీ మాట్లాడుతూ నిజాయితీ, సమగ్రత, నిర్దేశించిన నియమాలు, విధానాలకు కట్టుబడి ఉండటం, వాటి ప్రాముఖ్యతలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ అవినీతిని వ్యతిరేకించాలని కోరారు.